క్లుప్తంగా

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు

ఎచ్చెర్ల: మండలంలోని కుంచాలకుర్మయ్యపేట గ్రామంలో గల దేవీ ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఇక్కడ ఉన్న రాజరాజేశ్వరీ దేవీని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుడు బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఇక్కడ ఉన్న శ్రీచక్రాల వద్ద కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

సంతోషిమాతకు ఉద్యాపన పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు, ఉద్యాపనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మోదుకురి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. అనంతరం సామూహికంగా ఉద్యాపన పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ పలకలు



రైతుబజారు వద్ద కాలువపై పలకల దుస్థితి

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలో రద్దీ ప్రాంతాల్లో ఒకటైన రైతుబజారు కూడలి వద్ద కాలువపై పలకలు అస్తవ్యస్తంగా మారాయి. దీంతో ద్విచక్ర వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలతో పాటు కింద పలకలను కూడా చూసి డ్రైవ్ చేయాల్సి రావడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పలకలు సరిచేయాలని పలువురు కోరుతున్నారు.

21 నుంచి ఆలయ వార్షికోత్సవాలు



బాబా ఆలయం

జి.సిగడాం: మండలంలోని చెట్టుపొదిలాం గ్రామంలో షిర్డీ సాయిబాబా ఆలయ తృతీయ వార్షికోత్సవాలకు సర్వం సిద్ధం చేశామని ఆలయ ధర్మకర్త భూపతి అర్జున్ సాయి శుక్రవారం తెలిపారు. ఈ నెల 21 నుంచి వార్షికోత్సవాలను పూజ్య గురువులు అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని చెప్పారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అధికసంఖ్యలో సాయి భక్తులు తర లిరావాలని కోరారు. ఉత్సవాలను మూడు రోజులపాటు నిర్వహిస్తామని, ఉదయం, సాయంత్ర వేళ ల్లో ప్రత్యేక పూజలు చేస్తామన్నారు.

సౌకర్యాలకు తూట్లు

పాఠకులకు పాట్లు!

- సమస్యలకు నిలయంగా కేంద్ర గ్రంథాలయం
- మౌలిక సదుపాయాలు లేక అవస్థలు
- ఆచరణకు నోచుకుని కేంద్రమంత్రి, ఎమ్మెల్యేల హామీలు



జిల్లా కేంద్ర గ్రంథాలయం

శ్రీకాకుళం అర్బన్:

జిల్లా కేంద్ర గ్రంథాలయం సమస్యలకు నిలయంగా మారింది. నిత్యం వందలాది మంది పాఠకులు, నిరుద్యోగ అభ్యర్థులు వచ్చే ఈ సెంట్రల్ లైబ్రరీలో కనీస స్థాయిలో కూడా సదుపాయాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ జిల్లా ఇక్కడికి వచ్చారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తానని చెప్పి వెళ్లిపోయారు. ఇంతవరకు ఆచరణకు నోచుకోకపోవడంతో పాఠకులు ఆవేదన చెందుతున్నారు.

అంతా అస్తవ్యస్తం..



దుర్గంధభరితంగా మరుగుదొడ్లు

మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవడంతో పాఠకులకు ఇబ్బందులు తప్పడం లేదు. మంచినీటి సమస్య కూడా నెలకొంది. వారం రోజులుగా మోటారు పని చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్న ఫ్యాన్‌లు సక్రమంగా పనిచేయడం లేదు. మూడు కంప్యూటర్లలో రెండు పనిచేయడం లేదు. దీంతో ఒకరు కంప్యూటర్ వినియోగిస్తే మిగతా అభ్యర్థులంతా వేచి ఉండాల్సిందే.

ప్రహరీ లేక ఇక్కట్లు..



క్రికెట్‌బాల్ తగిలి విరిగి పోయిన కిటికీ గ్లాసులు

గ్రంథాలయానికి కాంపౌండ్ వాల్ లేకపోవడంతో వెనుక ఉన్న వీధి నుంచి పలువురు యువత వచ్చి క్రికెట్ ఆడుతున్నారు. ఆ సమయంలో కేకలు, అరుపులతో ఇబ్బందికరంగా ఉంటోందని పలువురు అభ్యర్థులు వాపోతున్నారు. క్రికెట్ బాల్ కిటికీలకు తగలడంతో తలుపులకు ఉన్న గ్లాసులు సైతంవిరిగిపోయాయి. అయినా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

హామీలు నెరవేరేనా?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ సందర్శించి అభ్యర్థులతో మాట్లాడారు. అప్పుడు సమస్యలన్నింటినీ అభ్యర్థులు ఏకరువు పెట్టారు. వీటిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించడంతో పాటు పూర్తిస్థాయిలో పోటీ పరీక్షల పుస్తకాలను సమకూరుస్తానని చెప్పిన మాటలు నీటిమూటలయ్యాయి. హామీలిచ్చి ఏడాది కావస్తున్నా ఏ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదు. మరుగుదొడ్ల సమస్యను గ్రంథాలయ అధికారులు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకువెళ్లగా.. పనులకు శంకుస్థాపన చేసి వెళ్ళిపోయారు తప్ప తదుపరి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నిరుద్యోగ అభ్యర్థులు కోరుతున్నారు.



చదువుతున్న విద్యార్థులు



గ్రంథాలయంలో మొరాయిస్తున్న వాటర్‌ప్లాంట్

ఇబ్బంది పడుతున్నాం..



రైల్వే పరీక్షల కోసం సిద్ధమవుతున్నాను. ఇక్కడికి నిత్యం వందలాదిమంది వస్తుంటారు. మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉంది. ఉన్నవి కూడా సక్రమంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అదనంగా నిర్మిస్తే బాగుంటుంది.

– ఎస్.రాజశేఖర్, సరుబుజ్జిలి

సౌకర్యాలు కల్పించాలి



డీయస్సీ కోసం సన్నద్ధమవుతున్నాను. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షల కోసం సరిపడా పుస్తకాలు లేవు. వాటిని సమకూర్చితే బాగుంటుంది. గ్రంథాలయానికి వచ్చిన పాఠకులకు, నిరుద్యోగ అభ్యర్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి.

– జి.వి.ఎస్.మూర్తి, శ్రీకాకుళం


కాంపౌండ్‌వాల్ నిర్మించాలి



కాంపౌండ్ వాల్ లేకపోవడంతో వెనుక వీధి నుంచి క్రికెట్ ఆడేందుకు గ్రంథాలయం వెనుక మైదానంలోకి వస్తుంటారు. వారంతా కేకలు పెడుతుండటంతో చదువుతున్న వారికి ఇబ్బందిగా ఉంటోంది. రాత్రివేళల్లోనూ కొందరు వచ్చి మందు, గంజాయి సేవించడం వంటి అసాంఘిక పనులు చేస్తున్నారు.

– దానేటి వెంకటరమణ, శ్రీకాకుళం

ఊరిస్తున్న ఆరోగ్య ఫలాలు



వాటర్ యాపిల్స్

నేరేడు పండ్లు

రాసి ఉసిరికాయలు

చీమచింతబొట్టలు

- చీమచింతబొట్టలు, రాసి ఉసిరికాయలు, వాటర్ యాపిల్, నేరేడు పండ్లకు గిరాకీ
- ధర ఎక్కువైనా కొనుగోలుకు వెనుకాడని జనం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చీమచింతబొట్టలు, రాసి ఉసిరికాయలు, నేరేడు, వాటర్ యాపిల్ .. ఈ తరహా పండ్లన్నీ ఒకప్పుడు ప్రతి పల్లెలోనూ లభ్యమయ్యేవి. చెరువు గట్లు, తోటలు, నదీ తీర ప్రాంతాలు, కొండలు, గుట్టల మీద ఎక్కడికక్కడ కనిపించేవి. ఆదివారాలు, వేసవి సెలవుల్లో పిల్లలంతా కలిసి వెళ్లి ఆయా పండ్లను తెచ్చుకుని ఆనందంగా తినేవారు. కాలక్రమేణా పరిస్థితి మారింది. అప్పుడున్నన్ని చెట్లు లేకపోవడం, పిల్లలు కూడా సెల్‌ఫోన్లకు అతుక్కుపోవడం, కొత్తకొత్త రుచులకు అలవాటు పడటంతో ఆయా పండ్లు చాలాఏళ్లు కనుమరుగయ్యాయి. ఇప్పుడు పరిస్థితి మారింది. ఆనాటి ఆరోగ్య ఫలాలకు మళ్లీ గిరాకీ పెరిగింది. గ్రామాల పరిస్థితి అటుంచితే నగరాల్లో ఎక్కడికక్కడ చీమచింతబొట్టలు, రాసి ఉసిరికాయలు, నేరేడు, వాటర్ యాపిల్ వంటి పండ్ల విక్రయించే బళ్లు కనిపిస్తున్నాయి. అందులో ఉండే పోషక విలువలపై అవగాహన పెరగడంతో వీటిని కొనుగోలు చేసే వారి సంఖ్య కూడా రోజురోజుకూ పెరుగుతోంది. ఫలితంగా ఆయా పండ్ల ధరలకు రెక్కలొస్తున్నాయి. జిల్లా కేంద్రంలో వాటర్‌యాపిల్ కిలో ధర రూ.400పైమాటే. ఈ పండ్లు తినడం వల్ల శరీరంలో నీటిస్థాయిలో పెరిగి శక్తిని పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు. నేరేడి పండ్లు కూడా దాదాపుగా రూ.400 ధర పలుకుతున్నాయి. విటమిన్–సి పుష్కలంగా లభించే రాసి ఉసిరికాయలు ధర కిలో రూ.300గా ఉంది. మలబద్ధకం, జీర్ణాశయ వ్యాధులకు ఇవి చక్కటి పరిష్కారం చూపుతాయని వైద్యుల మాట. సీజనల్‌గా అరుదుగా దొరికే ఈ పండ్లు ఇప్పుడు పెద్ద ఎత్తున అమ్ముడుపోతుండటం విశేషం.

వేతనాలు వెంటనే చెల్లించాలి



పరిశ్రమ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, యూనియన్ నాయకులు

రణస్థలం: మండలంలోని వరిశాం వద్ద గల శ్యాం పిస్టన్స్ ప్లాంట్–2 పరిశ్రమ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ.. పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు మార్చి నెల వేతనాలను వెంటనే చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత అక్టోబర్‌లో చెల్లించాల్సిన బోనస్ ఇంతవరకు చెల్లించలేదన్నారు. 30 ఏళ్ల సర్వీసు పూర్తయిందని 110 మంది కార్మికులతో బలవంతంగా రిటైర్మెంట్ చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వలేదన్నారు. చార్టర్ ఆఫ్ డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే దశల వారీగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. శ్యాంపిస్టన్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.అప్పలనర్సయ్య, గొర్లె కిరణ్, నాయకులు ఆర్.ఎస్.నాయుడు, కె.భోగేష్, ఎస్.నాగేశ్వరరావు, గురు ఈశ్వరరావు, ఎం.కూర్మారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

- 11 నెలల్లో ఒక్క సంక్షేమ పథకమైనా అమలు చేశారా?
- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలైనా పేదల కోసం ఒక్క సంక్షేమ పథకం కూడా సీఎం చంద్రబాబు అమలు చేయలేదని, ప్రజలను మోసం చేయడమే ఆయన నైజమని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆరోపించారు. రణస్థలంలోని పార్టీ కార్యాలయంలో జి.సిగడాం మండలానికి చెందిన ఎంపీటీసీలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ గాలికి వదిలేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, పార్టీ మండల అధ్యక్షుడు డోల వెంకటరమణ, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, మీసాల రాంబాబు, సర్పంచ్‌లు భూపతి సురేష్, బాలి రమేష్, వడిశ మహేశ్వరరావు, జిల్లా నాయకులు పిల్లల శివకుమార్, గోవిందరావు, ఎంపీటీసీలు పెద్ది శ్రీనివాసరావు, కుమరాపు రమేష్‌నాయుడు, బూటు అప్పారావు, కుదిరెళ్ల గోవిందరావు, తిరుమరెడ్డి లక్ష్మణరావు, పరశరాపు శ్రీనివాసరావు, గేదెల నారాయణరావు పాల్గొన్నారు.

24న మండల సమావేశం..

ఈ నెల 24 ఉదయం 10 గంటలకు జి.సిగడాం మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, నూతన కార్యవర్గ సభ్యులతో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తామని కిరణ్‌కుమార్ తెలిపారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతం కోసం అవసరమైన ప్రణాళికలు, అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను పరిచయం చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు చర్చిల్లో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మహిళా కళాశాల రోడ్డులోని క్రైస్తవారాధన చర్చిలో గుడ్ షెపర్డ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గోడి జోసెఫ్ ప్రసంగిస్తూ శుభ శుక్రవారం ఎందుకు జరుపుకుంటారో వివరించారు. ప్రజల ప్రాణాలు కాపాడేందుకే ఏసు క్రీస్తు శిలువ ధరించాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీస్తు శిలువపై పలికిన ఏడు వాక్యాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో నిస్సీ గోడి, విజయరత్నం, క్రైస్తవారాధకులు పాల్గొన్నారు. చిన్నబజారులోని తెలుగు బాప్టిస్టు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘ కాపరి ఆధ్వర్యంలో క్రీస్తు సందేశం వినిపించారు. శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల రోడ్డులోని సహాయమాత కెథడ్రల్ నుంచి సెయింట్ థామస్ దేవాలయం టౌన్ హాల్ వరకు శిలువ యాత్ర నిర్వహించారు. విచారణకర్తలు ఫాదర్ పాల్‌భూషణ్, ఫాదర్ బోనెల రాజుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ మొన్సిగ్నోర్ దూసి దేవరాజు, రెవ.ఫాదర్ నిద్దాన జేమ్స్, సెక్రటరీ రెవ.ఫాదర్ గుణశీలన్, విచారణకర్తలు రెవ.ఫాదర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు. పాస్టర్ చల్లా కరుణాకర్ ఆధ్వర్యంలో కల్వరి ప్రేయర్ టెంపుల్‌లో ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్తేర్ రాణి, తిమోతి, సైమన్‌రాజు, సౌభాగ్యవతి పోలు, కాలేబు తదితరులు పాల్గొన్నారు. డగ్లస్ హైస్కూల్లోని కీస్టోన్ చర్చిలో పాస్టర్ జోయల్ ఆధ్వర్యంలో శుభ శుక్రవారం ప్రార్థనలు జరిగాయి. కార్యక్రమంలో లిడియా జాన్, హనా జోసీ, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. స్టేడియం వద్ద సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో టి.రాజ్‌కిరణ్, సుధాకర్, డేవిడ్ రాజు, టి.జె.హెన్రీ, దేవానంద్, బి.జె.రమేష్‌కుమార్, శామ్యూల్ రాజ్, సుధాకరరెడ్డి, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.



తెలుగు బాప్టిస్టు చర్చిలో క్రైస్తవ గీతాల ఆలాపన



శ్రీకాకుళంలో సహాయమాత చర్చి ఆధ్వర్యంలో శిలువ యాత్ర



గార : ఏసుక్రీస్తు మహిమ మందిరంలో గీతాలాపన



క్రీస్తుకు శిలువ వేస్తున్న దృశ్యం



క్రైస్తవారాధన మందిరంలో ప్రార్థన చేస్తున్న పాస్టర్



కీస్టోన్ చర్చిలో ప్రార్థనలు

గార: మానవాళికి త్యాగాన్ని గుర్తు చేసిన మహనీయుడు ఏసు ప్రభువని బిషప్ వి.జాషువా అన్నారు. శుక్రవారం గారలోని ఏసుక్రీస్తు మహిమ మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. శిలువపై ఏసు పలికిన ఏడు మాటలను చదివి వినిపించారు. మహిళలు ప్రార్థనా గీతాలు ఆలపించారు. విశాఖపట్నం స్వర్ణ హోప్ ఫౌండేషన్ డైరక్టర్ సుదర్శనరావు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మనోధైర్యంతో ముందుకుసాగాలి: కేజీబీవీ ఎస్‌ఓ

కంచిలి: బాలికలు మనోధైర్యంతో ముందుకుసాగాలని కేజీబీవీ ఎస్‌ఓ రజిని అన్నారు. జాడుపూడి కేజీబీవీలో సమగ్రశిక్షా ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు 'పరీక్షలు, మార్కులే జీవితమా' అనే అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ బత్తిని ఈశ్వరరావు మాట్లాడుతూ పరీక్షల్లో తప్పినంత మాత్రాన జీవితం కోల్పోయినట్లు కాదన్నారు. ఉత్తీర్ణత బాగా లేకపోయినా ఎందరో వ్యక్తులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించారని గుర్తు చేశారు. జీవిత ప్రయాణంలో పరీక్షలు ఒక మెట్టు మాత్రమేనని, మన మార్కులు మన ప్రతిభను పూర్తిగా ప్రతిబింబించవని పేర్కొన్నారు. ఒక్కసారి తక్కువ వచ్చిన ఫలితాలు, జీవితాంతం మన విజయాలను నిర్దేశించలేవన్నారు. పట్టుదలతో చదివితే ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గోతులమయం

ఎచ్చెర్ల మండలంలోని తోటపాలెం కూడలి నుంచి కొత్తపేట, సెగిడిపేట, ముద్దాడ అంబే డ్కర్‌నగర్ వరకు ఉన్న రోడ్డు పూర్తిగా పాడైంది. గోతులు ఏర్పడి రాళ్లు తేలాయి. ఈ సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి స్థానికులు పలు సార్లు తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదు. రోడ్డును బాగు చేయాలని వాహనదారులు, విద్యార్థులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్



అసంపూర్తిగా..



ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం (నాడు–నేడు) అసంపూర్తిగా నిలిచిపోయింది. జి+1 పద్ధతిలో రూ.62 లక్షలతో ఈ భవనం పనులు గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. కూట మి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత భవనం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. బిల్లులు సైతం చెల్లించలేదు. పాఠశాల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

నిరుపయోగంగా..

ఎచ్చెర్ల మండలం చిలకపాలెం గ్రామంలో (పొందూరు రోడ్డులో) ఆర్అండ్ బీ బంగ్లా ఉంది. ఈ బంగ్లాను గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులు వినియోగించే వారు. అద్దెకు కూడా ఇచ్చేవారు. ప్రస్తుతం ఈ భవనాన్ని నిరుపయోగంగా విడిచిపట్టారు. దీంతో భవనం శిథిలమవుతోంది. మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

